క్లుప్తంగా

విలేజ్ క్లినిక్‌ల్లో సమర్థంగా సేవలు

నర్సీపట్నం : జిల్లాలో విలేజ్ క్లినిక్‌లు సమర్థవంతంగా పని చేస్తున్నాయని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీరజ్యోతి తెలిపారు. సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించి ఆమె పలు విలేజ్ క్లినిక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సక్రమంగానే సేవలు అందిస్తున్నారని తెలిపారు. 104 వాహనాల ద్వారా షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో సంచార చికిత్స అందిస్తున్నారని తెలిపారు.

టైప్-4 కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

మాకవరపాలెం: ఉన్నత పాఠశాలలో ఉన్న టైప్-4 కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైప్-4 కేజీబీవీలో 9,10 తరగతులతోపాటు ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం చదివే విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నారాయణరావును సంప్రదించాలన్నారు.

గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

మాడుగుల రూరల్ : ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను సోమవారం ఉదయానికి స్తంభాలు వేసి విద్యుత్ పునరుద్ధరించారు. ఆదివారం సాయంత్రం మండలంలో వీచిన ఈదురు గాలులకు 20 విద్యుత్ స్తంభాలు పూర్తిగా నేలకొరిగాయి. దీంతో ఆదివారం రాత్రి పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆదివారం రాత్రి నుంచి ట్రాన్స్‌కో సిబ్బంది, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనిలో నిమగ్నులై వున్నారు. సోమవారం ఉదయం నాటికి పూర్తిగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని మండల ట్రాన్స్‌కో ఏఈ ఎం. రాంబాబు తెలిపారు. గరికబంద చెక్‌పోస్టు సమీపంలో ఈదురుగాలుల వల్ల నేలకొరిగిన చెట్టును ఆదివారం రాత్రి పొక్లెయిన్ సాయంతో తొలగించామని ఆర్అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్ తెలిపారు.

ఉపాధి బకాయిలను విడుదల చేయాలి

కె.కోటపాడు : మండలంలో ఇప్పటి వరకూ వేతనదారులకు చెల్లించాల్సి ఉన్న సుమారు రూ.12 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు డిమాండ్ చేసారు. గొండుపాలెం గ్రామంలో సోమవారం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ఉపాధి నిధులను తగ్గించి వేతనదారులకు పనులు లేకుండా చేస్తోందని ముత్యాలనాయుడు ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు యర్రా దేముడు పాల్గొన్నారు.

వారపు సంతలో పనస ధరలు తగ్గుదల



మాడుగుల వారపు సంతలో కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న పనస రైతులు

మాడుగుల : మాడుగుల పట్టణంలో సోమ వారం జరిగిన వారపు సంతలో పనసపండ్లకు ధరలు పలకలేదని, గిరి రైతులు ఆవేదన చెందుతున్నారు. గతంలో పెద్దవి జత పనస పండ్లు రూ.100 పలికేవని, కానీ ప్రస్తుతం రూ.60 కూడా పలకలేదని ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది విశాఖ మన్యంలో అధికంగా పనస పండ్లు దిగుబడి పెరగడంతో ధరలు తగ్గిపోతున్నాయని, దూరప్రాంతాల నుంచి వ్యాపారులు రాకపోవడంతో ధరలు గిట్టుబాటు కాక ఎదురు చూస్తున్నామని గిరి రైతులు చెబుతున్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

నాతవరం : చమ్మచింత జంక్షన్‌లో గల శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో సోమవారం ద్వితీయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు నుంచి ఆలయంలో వేదపండితులతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ గణపతిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఈ చుట్టు పక్కల గ్రామాల నుంచి విచ్చేశారు. భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉచిత వైద్య శిబిరం

గొలుగొండ : వ్యాధుల పట్ల రోగులు అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ తెలిపారు. సోమవారం పప్పుశెట్టిపాలెం గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 70 మంది రోగులకు వైద్యాధికారి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాల కారణంగా వ్యాధులు సోకే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ వైద్య సిబ్బంది ఇచ్చే సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పండుటాకులకు పరేషన్!

- వృద్ధులు, దివ్యాంగులకు ఇంటింటికీ రేషన్ అమలేదీ?
- చౌక డిపో దూరాభారం
- నెత్తిన బియ్యం మూటతో వృద్ధుల అవస్థలు

65 ఏళ్లు వయస్సు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు నేరుగా ఇంటికే రేషన్ డీలర్ ద్వారా నిత్యవసర సరుకులు అందిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఒకటో తేదీ నుండి 5వ తేదీలోపే దివ్యాంగులు, వృద్ధులకు రేషన్ బియ్యం ఇంటికి అందిస్తామని తెలిపింది. కానీ ఆచరణలో విఫలమైంది. ముఖ్యంగా చౌక డిపోలు లేని గ్రామాల్లోని వృద్ధులకు రేషన్ తెచ్చుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది.



ఇంటికి బియ్యం అందించలేదని చెబుతున్న చిన భీమవరానికి చెందిన వృద్ధురాలు మహాలక్ష్మ



పెదపూడి డిపో నుండి రేషన్ బియ్యంతో రాజుపాలేనికి నడిచి వెళ్తున్న రాజులమ్మ



వడ్డాదిలో డిపో నుంచి నెత్తిమీద బియ్యం మూటతో ఇంటికి వస్తున్న సన్యాసమ్మ

బుచ్చెయ్యపేట: వృద్ధులు, దివ్యాంగులు ప్రభుత్వం అందించే రేషన్ తెచ్చుకోవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎండీయు వాహనాల ద్వారా బియ్యం, పంచదార, కందిపప్పు, ఇతర వస్తువులు నేరుగా ఇంటికే అందేవి. కూటమి ప్రభుత్వం ఎండీయు వాహనాలను తప్పించాక వినియోగదారులకు తిరిగి రేషన్ కష్టాలు మొదలయ్యాయి.

బుచ్చెయ్యపేట మండలంలో 47 రేషన్ డిపో లున్నాయి. 20,640 రేషన్ కుటుంబాలుండగా వీరిలో 2,885 మంది వృద్ధులు,దివ్యాంగులున్నారు. 35 గ్రామాల్లో రేషన్ షాపులుండగా 21 గ్రామాల్లో రేషన్ డిపోలు లేవు. పలు గ్రామాల్లో రేషన్ డీలర్లు కొంతమందికే తూతూ మంత్రంగా ఇంటింటికీ రేషన్ బియ్యం అందించి అందరికీ ఇచ్చినట్టు అధికారులకు నివేదికలు ఇస్తున్నారు. పలు గ్రామాల్లో చాలా మంది వృద్ధులు, దివ్యాంగులు మాత్రం నిత్యావసర వస్తువుల కోసం రేషన్ డిపోలకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుముదాంపేట, పీపీ అగ్రహారం, గొర్రెలపాలెం, చిన్నయ్యపాలెం, ఎస్ఎల్ నగర్, గంగాదేవిపేట, చిన మల్లాం, చిన భీమవరం, లోపూడి, ఐయ్యరకలపాలెం, ఉప్పరగూడెం, శంకరాపురం, అప్పంపాలెం, చిన కందిపూడి తదితర గ్రామాల్లో రేషన్ డిపోలు లేవు. గత ప్రభుత్వంలో మండలంలో 14 ఎండీయూ వాహనాల ద్వారా ప్రతి ఇంటికీ రేషన్ బియ్యం, ఇతర నిత్యవసర వస్తువులు అందేవి. ఇపుడు రేషన్ డిపోలు లేని గ్రామస్తులంతా రెండు నుంచి నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి నిత్యవసర వస్తువులు నెత్తిమీద పెట్టి తెచ్చుకోవాల్సి వస్తుంది.

అవస్థలు పడ్డాను...



నాకు ఎవరూ లేరు. నేను ఒక్కదాన్నే ఉంటాను. ప్రభుత్వం అందించే నిత్యవసర వస్తువులు, పింఛన్ మీదనే ఆధారపడి జీవిస్తున్నాను. నాకు 75 ఏళ్ల వయస్సు పైబడినా ఇంటికి తెచ్చి బియ్యం, పింఛన్ ఇవ్వడం లేదు. గతంలో ఇంటికే తెచ్చి పింఛన్, బియ్యం అందించేవారు. ఇపుడు కిలోమీటరు దూరం నడిచి వెళ్లి బియ్యం, పింఛన్ తెచ్చుకుంటున్నాను.

– చల్లా సన్యాసమ్మ, వడ్డాది

ఇంటికే రేషన్ అందివ్వాలి



నాలాంటి ముసలోల్లకి గతంలో వ్యాను ద్వారా ఇంటి వద్దే ఒకటో తేదీనే బియ్యం అందించేవారు. ఈ నెల 6వ తేదీన నాతో రేషన్ డీలర్ వేలిముద్ర వేయించుకున్నారు. ఇంటికి బియ్యం తీసుకురాకపోవడంతో 8వ తేదీన నా మనవడిని పంపించి బియ్యం తెప్పించుకున్నాను. ఇంటికే బియ్యం తీసుకువచ్చి అందించి నాలాంటి వృద్ధులను ఆదుకోవాలి.

– అధికార లోవమ్మ, చిన భీమవరం

కాలువల్లో పూడికతీత పనులు

సాక్షి ఎఫెక్ట్..



కాలువలో పూడికతీత పనులు నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు

కె.కోటపాడు : చౌడువాడలో గల దివాన్‌సాగర్, గైరమ్మ చెరువుల్లోనికి వర్షపునీరు ప్రవహించే కాలువల్లో పూడికతీత పనులను ఉపాధి కూలీలతో సోమవారం నుంచి చేపడుతున్నారు. రెండు చెరువుల్లో ఇటీవల వర్షాలకు నీరు రాని పరిస్థితిపై నెరవేరని ఉపాధి లక్ష్యం శీర్షికన ఈ నెల 7న సాక్షిలో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి చెరువుల్లోనికి నీరు ప్రవహించే కాలువ పరిస్థితిని గుర్తించాలని, అవసరం అయితే వెంటనే ఉపాధి పనులను చేపట్టాలని ఎంపీడీవో సాంబశివరావు, ఏపీవో అప్పలరాజుకు సూచించారు. దీంతో వీరు రెండు చెరువులు, కాలువల పరిస్థితిని పరిశీలించారు. చెరువుల్లోనికి నీరు ప్రవహించేందుకు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు ఉపాధి నిధులను మంజూరు చేసే చర్యలను తీసుకున్నారు. దివాన్ సాగర్ చెరువుకు వర్షపునీరు వచ్చే 1600 మీటర్ల పొడవు గల కాలువలో పూడికతీత పనులను జరిపేందుకు రూ.2.16 లక్షలు, గైరమ్మ చెరువులోనికి వర్షపునీరు వచ్చేందుకు 400 మీటర్ల కాలువలో పూడికతీత పనులకు రూ.81వేలు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో చెరువుల్లోకి నీరు వచ్చే కాలువల్లో పూడికతీత పనులు జరపడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సాక్షికి, ఉపాధిహామీ పీడీకి కృతజ్ఞతలను తెలుపుతున్నారు.

మండలానికి బదిలీపై 27 మంది ఉపాధ్యాయులు



బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు

రావికమతం : ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా మండలానికి 27 మంది బదిలీపై వచ్చి సోమవారం ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. మండలంలో 53 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 60 పాఠశాలల్లో 165 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 13 పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేశారు. వివిధ ప్రాంతాల నుంచి 27 మంది ఉపాధ్యాయులు బదిలీపై మండలానికి వచ్చారు. వీరిలో 13 మంది మోడల్ పాఠశాలల హెచ్‌ఎంలుగా, మిగతా 14 మంది ప్రాథమికోన్నత పాఠశాలలకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో మోడల్ పాఠశాలల హెచ్‌ఎంలు ఏడుగురు, మట్టవానిపాలెం యు.పి స్కూలు నుంచి నలుగురు ఉపాధ్యాయులు బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లి పోయారు. మండలానికి బదిలీపై వచ్చిన 27 మంది ఉపాధ్యాయులకు స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈవో తలుపులు, ఎంఈవో-2 బ్రహ్మాజీ , సీఆర్‌పీలు, ఉపాధ్యాయ సంఘాలు, సిబ్బంది సాదరంగా ఆహ్వానం పలికారు. సోమవారం వారంతా తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు.

11న ప్రత్యేక పూజలు

మాకవరపాలెం : ఈ నెల 11న మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గల దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు మల్లికార్జునశర్మ తెలిపారు. ఆలయ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ఈ పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

ప్రకృతి సేద్యంతో పెట్టుబడి ఆదా



రైతులకు విత్తనాల కిట్లను అందజేస్తున్న ఏవో చిరంజీవి

మాకవరపాలెం : ప్రకృతి సేద్యంపై రైతులు దృష్టి సారించడం ద్వారా పెట్టుబడిని ఆదా చేసుకోవచ్చని ఏవో చిరంజీవి అన్నారు. మండలంలోని లచ్చన్నపాలెంలో సోమవారం రైతులతో వ్యవసాయ, ప్రకృతి సేద్య అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో చిరంజీవి మాట్లాడుతూ ప్రకృతి సేద్యం చేసే విధానం, దిగుబడులు, సాగుకయ్యే కర్చుల వివరాలను తెలియజేశారు. ఈ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా రసాయన రహిత పంటను పొందవచ్చన్నారు. ప్రకృతి సేద్యానికి ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తోందన్నారు. అనంతరం నవధాన్య విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి సేద్య మండల ఇన్‌చార్జ్ కవిత, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల్లో ఎరువుల తయారీపై దృష్టి



కొత్తపెంటలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉమాదేవి, సర్పంచ్ రొంగలి వెంకటరావు

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంట, వేచలం, ఎన్‌జీ.నగరం, కలిగొట్ల పంచాయితీలలో ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవో అనంత ఉమాదేవి సోమవారం పర్యటించారు. ఆయా గ్రామాలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పర్యవేక్షించారు. చెత్త సంపద కేంద్రం నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ విధానంపై సిబ్బందికి ఆమె పలు సలహాలు, సూచనలు చేశారు. సేంద్రియ ఎరువుల మార్కెటింగ్‌పై హరిత రాయబారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయా పంచాయతీలలో క్షేత్ర స్థాయిలో పర్యటించిన ఆమె పారిశుద్ధ్యం నిర్వహణపై స్థానిక పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. అనంతరం ఆయా పంచాయతీలలో అభివృద్ధి పనులపై స్థానిక సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ రొంగలి వెంకటరావు పాల్గొన్నారు.

సచివాలయాల కుదింపు తగదు



ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు

రోలుగుంట : ప్రజలకు మేలు చేసే విధంగానే ప్రభుత్వం ఆలోచన చేయాలే కాని ప్రజల్లోను, ఉద్యోగుల్లో ఆందోళన కల్పించే సచివాలయాల కుదింపు ఆలోచన విరమించుకోవాలని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. సచివాలయాలు, ప్రజలకు వాటి మేలు గురించి ఆయన సోమవారం మండల విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అన్ని శాఖల కార్యాలయాల సేవలు ఒకే దగ్గర అందించే మంచి ఆలోచనతో గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో సచివాలయాల ఏర్పాటు చేశారని అన్నారు. దీంతో ప్రజలకు అన్ని శాఖల కార్యాలయాల సేవలు ఒకే దగ్గర అందడం ఎంతో గొప్ప ప్రజాప్రయోజనం కాగా, అన్ని శాఖలకు ఉద్యోగాల నియామకం జరగడంతో ప్రతి మండలంలోను నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలు రద్దు చేయడం, పేర్లు మార్పు చేయడం తగదన్నారు. ఇప్పటికే రేషన్ సరఫరా వాహనాలు రద్దు చేసి ఆ వాహనంలో పని చేసే ఉద్యోగులు రోడ్డున పడడానికి కారణమయ్యారని, అలాగే వలంటీర్లను తొలగించారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలులో విఫలం చెందిన ఈ కూటమి ప్రభుత్వం వాటిని కప్పిపుచ్చుకోవడానికి సచివాలయాల కుదింపు ఆలోచన చేయడం బాధాకరమన్నారు.

బదిలీపై ఆరుగురు ఉపాధ్యాయులు విధుల్లో చేరిక



పాఠశాలలో మొక్కలను నాటుతున్న ఉపాధ్యాయులు

కె.కోటపాడు : ఎ.కోడూరు హైస్కూల్‌లో సోమవారం ఆరుగురు ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర పాఠశాలల నుంచి బదిలీ అయిన ఈ ఉపాధ్యాయులు ఎ.కోడూరు హైస్కూల్‌లో జాయినింగ్ రిపోర్ట్‌ను ప్రధానోపాధ్యాయుడు ఎ.శేఖర్‌కు అందించి చేరారు. వేచలం హైస్కూల్ నుంచి ఎం.లక్ష్మణరావు, జన్నవరం హైస్కూల్ నుంచి ఆర్.సూర్యప్రకాష్, గోపాలపట్నం హైస్కూల్ నుంచి ఎస్.బాబూరావు, వరహాపురం హైస్కూల్ నుంచి ఎల్.కరుణ, కాశీపురం హైస్కూల్ నుంచి కె.సూర్యకాంతం, రావాలమ్మపాలెం హైస్కూల్ నుంచి బి.రామ సునీత ఉన్నారు. వీరంతా హెచ్‌ఎం శేఖర్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పీఎంసీ కమిటీ చైర్మన్ కిల్లి సింహాచలంనాయుడు, ఉపాధ్యాయులు ప్రసాద్, వి.బంగారునాయుడు, జూనియర్ అసిస్టెంట్ సిహెచ్ శేఖర్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



డీటీ నరేంద్రకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

నర్సీపట్నం : అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా సమితి నాయకులు తహసీల్దార్ కార్యాలయం డిటి నరేంద్రకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జాతీయ సమితి సభ్యులు గంగాభవానీ, రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు గురుబాబు మాట్లాడుతూ భూమిలేని నిరుపేద కౌలు రైతులకు, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలన్నారు. పెరుగుతున్న సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



యోగా కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది



చీడికాడలో యోగాపై అవగాహన ర్యాలీ



కె.కోటపాడులో యోగాపై అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న ఎంపీడీవో సాంబశివరావు



మాడుగులలో యోగా ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ రాజారామ్, ఎంపీడీవో అప్పారావు

నర్సీపట్నం: రోజూ రోగా చేయడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర పేర్కొన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆరోగ్యశాఖ సిబ్బందితో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి పలు ఆసనాలను ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్టీసీ డిపోలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బందితో పలు అసనాలను వేసారు. డిపో మేనేజర్ ధీరజ్ పాల్గొన్నారు. యోగా గురువు రాజుబాబు ఆసనాలు వేయించారు.

చీడికాడ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో హేమసుందరరావు అన్నారు. సోమవారం యోగాంధ్రాలో భాగంగా చీడికాడ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావు ఉన్నారు.

కె.కోటపాడు : విద్యార్థి దశ నుండే యోగాను అలవర్చుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక స్థైర్యం పెరుగుతుందని ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. కె.కోటపాడులో సోమవారం ఆయన మండల పరిషత్, సచివాలయ సిబ్బందితో కలిసి యోగాపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం చినబాబు, సీసీలు వెంకటరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

మాడుగుల : యోగాతోనే సంపూర్ణారోగ్యం సాధ్యమవుతుందని, తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. సోమవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన యోగా ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. యోగా మన దేశ వారసత్వ సంపద అని పేర్కొన్నారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, మండల స్థాయి అధికారులు, ఐసీడీఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది అఖిల పక్ష నాయకులు పాల్గొన్నారు.

రెండు గిరిజన గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

చీడికాడ: గడిచిన నాలుగు రోజులుగా మండలంలోని వి.బి.పేట పంచాయతీ శివారు గిరి గ్రామాలైన గొప్పూరు,కొండెంపూడి గ్రామాలకు గడిచిన నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఫిర్యాదులు చేసినా విద్యుత్ సిబ్బంది స్పందించక పోవడంతో గిరిజనులు పడుతున్న ఇబ్బందులుపై గొప్పూరు గ్రామస్తులు విద్యుత్ సిబ్బందికి వ్యతిరేకంగా గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ సమస్యపై సాక్షిలో సోమవారం ప్రచురితమైన శీర్షికకు చీడికాడ విద్యుత్ ఏఈ వెంకటరావు స్పందించి రెండు గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్‌లో ముడిచర్ల వద్ద గల విద్యుత్ లైన్‌లో దెబ్బతిన్న ఇన్సులేటర్ మార్చడంతో పాటు లైన్‌పై పడిన చెట్లు కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు తెలిపారు. దీంతో ఆయా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

రోగులకు సక్రమంగా సేవలందించాలి



వైద్యశిబిరాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

మాకవరపాలెం: రోగులకు సక్రమంగా సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి ఆదేశించారు. లచ్చన్నపాలెంలో సోమవారం నిర్వహించిన ఎఫ్‌డీపీ వైద్య శిబిరాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బూరుగుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి చరిష్మను ఆదేశించారు.

పంపిణీకి సిద్ధంగా పాఠ్య పుస్తకాలు

రోలుగుంట: మడంలంలో గల అన్ని పాఠశాలలకు ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పేరుతో ఇవ్వనున్న పాఠ్య పుస్తకాలు, దుస్తులు, బెల్టు తదితర మెటీరియల్‌ను మంగళవారం నుంచి ఆయా పాఠశాలలకు సరఫరా చేసేందుకు సిద్ధం చేసినట్టు ఎంఈవో జగ్గారావు తెలిపారు. వచ్చిన మెటీరియల్‌లో పాఠ్యపుస్తకాలు 12 ,433, డిక్షనరీలు-231, నోట్‌బుక్స్ 15,640, యూనిఫామ్ దుస్తులు 2387, బెల్టులు 1549 వచ్చాయన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

కె.కోటపాడు : మురుగునీటిలో వృద్ధి చెందే దోమకాటు ద్వారానే మలేరియా వ్యాధి సోకే అవకాశాలు అధికంగా ఉన్నాయని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. వి.సంతపాలెం గ్రామంలో సంచార చికిత్స కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె వైద్య పరీక్షలు జరిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు లేకుండా చేస్తే మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలను నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా 82 మందికి వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులను అందించారు.

షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం



అనకాపల్లిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్, డీఈవో, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా మండలానికి చెందిన ఆరుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నారు. కేజీబీవీ నుంచి గాలి లాస్య, లగుడు హర్షిత, జెడ్పీ ఉన్నత పాఠశాల, కొంతలం నుంచి నిట్టా యస్వంత్, చీడిపల్లి కల్యాణి, బీబీ పట్నం నుంచి చింతల రామకృష్ణ, రోలుగుంట నుంచి బేతా బేబీకి ఒక్కొక్కరికీ రూ.20 వేల చెక్కు, అవార్డు అందజేశారు.

– రోలుగుంట



షైనింగ్ సార్స్ అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు సోమిరెడ్డి ఉదయ్ ప్రసాద్ నాయుడు, కలిగిరి వర్షిత లాస్య, మట్టా హేమ చందు, పల్లా రామకృష్ణ, జుత్తాడ దివ్య, కోన భువన

– రావికమతం



అవార్డు అందుకుంటున్న కొండపల్లి శ్రీలక్ష్మి. శ్రీలక్ష్మితో పాటు మండలానికి చెందిన విద్యార్థులు బంగా మనోహర్, సింగిడి సాయి కుసుమ, బొంకుల ఈశ్వర్ ప్రసాద్, గోకివాడ విజయజ్యోతి, జనపరెడ్డి ప్రవీణ్, ఉషారాణి షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నారు.

–బుచ్చెయ్యపేట



జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రిషి జూనియర్ కాలేజీ విద్యార్థులు పులగల మహిమజ్యోతి, ఉడతపల్లి ప్రణతి

– నర్సీపట్నం



అవార్డు అందుకుంటున్న విద్యార్థులు బి.హర్షిత, గుంపాన ఉదయ్‌కుమార్, మురుకుర్తి దేవానంద్, చెరుకూరి మౌనిష, శ్రీనాథ విజయకృష్ణ, పెంట జయ శ్యామ్‌కుమార్

– దేవరాపల్లి